క్లుప్తంగా

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

పెద్దాపురం: సామర్లకోట రాక్ సిరామిక్ పరిశ్రమలో తొలగించి కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు కోరారు. సీఐటీయూ నాయకుడు డి.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బుధవారం తొలగించిన కార్మికులు పెద్దాపురం క్యాంపు కార్యాలయంలో తుమ్మల బాబును కలసి సమస్యను వివరించారు. దీంతో తుమ్మల బాబు ఏలూరు కార్మిక శాఖ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. లేకుంటే కలెక్టర్ దృష్టిలో ఉంచి కార్మికుల వెంట సమస్య పరిష్కారానికి పోరాడాతమన్నారు.

పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీలు

కొత్తపల్లి: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని రవీంద్రపురం, కొత్తపట్నం ఎంపీపీ పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను బాల కార్మికులుగా మార్చరాదన్నారు. బాలికలకు బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నట్టు చెప్పారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



గోర్సలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని స్వచ్ఛ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మురాలశెట్టి సునీల్ అన్నారు. పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్ కల్యాణ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బుధవారం మండలంలోని గోర్స గ్రామంలో 10 వేల కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ మొక్కలు నాటుతామన్నారు. ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పిల్లా శ్రీధర్, మత్సా అప్పాజీ, మారిశెట్టి సత్తిబాబు, సానా నాగు, గంధం అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపులో తనిఖీలు



సామర్లకోటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

సామర్లకోట: స్థానిక గాంధీచౌక్‌లోని శ్రావణి ఎరువుల షాపులో ఏడీఏ మాధవి, ఏఓలు అరుణ, సుధామాధురి, సత్యలు బుధవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో ఎరువులు, పురుగుమందులు నాణ్యమైనవో కాదో పరిశీలించారు. అయితే మండల పరిధిలో సుమారు 28 ఎరువుల దుకాణాలుండగా తూతూమంత్రంగా ఒక్క దుకాణాన్నే పరిశీలించడమేంటని స్థానిక రైతులు ప్రశ్నిస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

ప్రియుడి ఇంటి వద్ద ప్రియురాలి ఆందోళన



పాత ఇసుకపల్లిలో ప్రియుడి ఇంటి వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న యువతి

కొత్తపల్లి: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ ఒక యువతి తన ప్రియుడు ఇంటి వద్ద బైఠాయించి బుధవారం ఆందోళన చేసింది. పాత ఇసుకపల్లి ఎస్సీపేటకు చెందిన పిరాటి మానస అదే గ్రామానికి చెందిన అంగులూరి నవీన్ కుమార్ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. తాజాగా పెళ్లి ప్రస్తావన తీసుకురాగా తన తల్లిదండ్రులు ఒప్పుకోవాలని, లేదంటే కుదర దని ఆమెకు బదులిచ్చాడు. దీంతో ఆమె ఇటీవల కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇరువురు పెద్దలను పిలిచి చర్చించి నవీన్ తల్లిదండ్రులను పెళ్లికి ఒప్పించారు. ఇపుడు నవీన్ కుమార్‌ను హైదరాబాబు పంపించేశారు. తనతో మాట్లాడకుండా ఫోన్ పనిచేయకుండా చేశారు. ఈ విషయాన్ని అడగడానికి ఇంటికి వెళ్తే తల్లిదండ్రులు అందర్ని పిలిచి అల్లరి చేయడమే కాకుండా బయటకు ఈడ్చేశారని మానస ఆవేదన వ్యక్తం చేసింది. నవీన్‌కుమార్‌తో వివాహానికి ఒప్పుకునే వరకు ఆందోళన విరమించేది లేదని, అవసరం అయితే ప్రాణత్యాగానికి పాల్పడతానంది.

అందరికీ ఆరోగ్య యోగం

- ఏటిపట్టు గ్రామాల్లో యోగాపై శిక్షణ
- ప్రజలకు ఆయుర్వేద వైద్య సేవలు
- ఆదర్శంగా నిలిచిన యోగా గురువు రామకృష్ణ
- రేపు ప్రపంచ యోగా దినోత్సవం



పులిమేరు శిక్షణ కేంద్రంలో యోగా నేర్పిస్తున్న గురువు రామకృష్ణ

పెద్దాపురం: సమాజంలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలనుకున్నాడు ఆయన. తనలో ఉన్న నైపుణ్యతను ఇతరులకు తెలియజేయాలంటే ఏం చేయాలని ఆలోచింప సాగాడు. అప్పుడే తనకు ఓ ఆలోచన తట్టింది. తనకు ఉదయాన్నే లేచి యోగా చేసే అలవాటు ఉంది. దీనిపై పల్లె ప్రజలకు శిక్షణ ఇస్తే బాగుంటుందని తన మదిలో తట్టిన ఆలోచనే ఆయనను యోగా గురువును చేసింది. తనకున్న జ్ఞానంతో మారుమూల పల్లె ప్రజలకు యోగా శిక్షణ ఇస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారు. మారుమూల పల్లెలో యోగా కేంద్రం ఏర్పాటు చేసి సుమారు 100 మందికి శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈ ప్రత్యేక కథనం...

కోరుకొండ మండలం నుంచి దివిలికి...

తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బొల్లెద్దుపాలేనికి చెందిన మసిముక్కల రామకృష్ణ తాను చేసిన ఓ తప్పిదం వల్ల స్వగ్రామం వెళ్లలేక పెద్దాపురం మండలం దివిలిలోని అత్తారింటికి కాపురం వచ్చేశాడు. ఓ బంక్‌లో పనిచేస్తూ ఇక్కడ వారితో పరిచయాలు ఏర్పరుచుకున్నాడు. తనవద్ద ఉన్న యోగా పరిజ్ఞానాన్ని ఇక్కడి ప్రాంత వాసులకు పరిచయం చేశారు. మండలంలోని పులిమేరులో అభయాంజనేయ యోగా కేంద్రం ఏర్పాటు చేసి వంద నుంచి 150 మందికి పైగా యోగా శిక్షణ ఇస్తున్నారు.

ఆయుర్వేద వైద్య సేవలు

యోగాతో మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం లభిస్తుందని, ప్రతిఒక్కరూ యోగా నేర్చుకోలంటూ పులిమేరు పరిసర గ్రామాల్లో ఏటా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రతి పదిహేను రోజుల కోసారి దివిలి, తిరుపతి, చదలాడ, పులిమేరు, పిఠాపురం మండలం విరవ గ్రామాల్లో యోగాసనాలు వేస్తూ యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పలువురు యోగాపై శిక్షణ ఇవ్వాలని ఆయనను కోరారు. ఆయా గ్రామాలకు చెందిన 12 ఏళ్ల పిల్లల నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకూ సుమారు 150 మంది ఇక్కడ బ్యాచ్‌ల వారీగా శిక్షణ పొందుతున్నారు. ప్రాణామాయం, సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ధ్యానం ఇక్కడ శిక్షణ కేంద్రంలో నేర్పిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు రామకృష్ణ. దీంతో పాటుగా తనకు తెలిసిన ఆయుర్వేద వైద్యంతో చాలా మందికి చిన్నపాటి రోగాలను తగ్గిస్తూ వైద్య సేవలందిస్తున్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యమే తన లక్ష్యమంటూ తనకున్న ఆయర్వేద జ్ఞానంతో అమ్మ అమృత రెస్టారెంట్ పేరుతో రూ.10కే నానబెట్టిన మొలకలు, బ్లాక్ రైస్ ఇడ్లీ, చిరుధాన్యాలతో తయారు చేసిన దోసె, గ్లాసుడు చోడి అంబలిని అందిస్తున్నారు. యోగాతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు విశేష కృషి చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు ఈ యోగా గురువు.



అవగాహన ర్యాలీలో యోగాసనాలు వేస్తున్న శిక్షకులు (ఫైల్)



యోగా శిక్షణ పొందిన మహిళలు



యోగా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన అమృతాహార కేంద్రం

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రజలకు యోగాపై శిక్షణ, రూ.10కే నానబెట్టిన మొలకలతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నాం. యోగా, ఆయుర్వేదపై ఉన్న జ్ఞానం నా జీవితంలో మంచి మార్పును తెచ్చిపెట్టింది. ప్రతిఒక్కరూ యోగాపై అవగాహన పెంచుకోవాలి. యోగాతో కొన్ని రోగాలు దూరం కావడంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుంది.

– మసిముక్కల రామకృష్ణ, యోగా గురువు, పులిమేరు, పెద్దాపురం మండలం

పాఠశాలల్లో డీఈఓ తనిఖీలు



గొల్లప్రోలు జిల్లా పరిషత్ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ రమేష్

గొల్లప్రోలు: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణ, పరిసరాల్లో పరిశుభ్రత లోపించడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణను తక్షణమే శుభ్రం చేయించాలని ఆదేశించారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, పదో తరగతి ఫలితాలపై ఉపాధ్యాయులను ఆరా తీశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సబ్జెక్ట్‌ల వారీగా విద్యార్థుల ప్రగతిపై ఆరా తీశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని చెందుర్తి ఈబీసీ కాలనీలో ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో ఆర్వో ప్లాంట్ నిరుపయోగంగా ఉండటం, ఉపాధ్యాయుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మెరుగు పరుచుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఈఓ-2 బీవీఎస్ ప్రసాద్, పీఈ రపీ రామకృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు అతిథి అధ్యాపకుడు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో మాస్టర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ లేదా సమాన అర్హత గల సబ్జెక్టులో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీన అర్హత ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. ఇంటర్వ్యూతో పాటు సంబంధిత సబ్జెక్టులో డెమో ఇవ్వాలన్నారు.

మండలంలో జోరుగా ‘నేను బడికి పోతా’



బడిలో చేరడానికి చిన్నారులకు అనుమతి పత్రాలు అందజేసిన ఎంఈఓ, ఉపాధ్యాయులు

సామర్లకోట: ‘నేను బడికి పోతా’ కార్యక్రమాన్ని మండలంలో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలనే విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు ఆరేళ్ల వయసు పైబడిన పిల్లలందరూ స్కూళ్లలో చేరేలా చైతన్యం కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం మండలంలోని పీబీ దేవం గ్రామంలో ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో నేడు బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరేళ్ల వయసు పూర్తయిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకున్నారు. వారిని సమీప పాఠశాలల్లో చేర్చుకొంటూ అనుమతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి వారి తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలల్లో రుచికరమైన మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పీబీదేవం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని మౌలిక సదుపాయాలను, మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ శివరామకృష్ణయ్య పరిశీలించి భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్కును అభివృద్ధి చేయాలని వినతి

పిఠాపురం: పట్టణంలోని ఉప్పాడ సెంటర్లో ఉన్న పురాతన చిన్నమాంబ పార్కును అభివృద్ధి చేయాలని పిఠాపురం వాకర్స్ క్లబ్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. పిఠాపురం వాకర్స్ క్లబ్ సభ్యులు పార్కు బుధవారం చిన్నమాంబ పార్కులో మున్సిపల్ కమిషనర్ కనకారావును కలశారు. పార్కు అభివృద్ధిపై ఆయనకు పలు సూచనలు చేశారు. ఎన్నో ఏళ్లుగా పట్టణంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు సేదదీరడానికి వసతి సౌకర్యాలతో పార్కు ఉండేదన్నారు. కాలక్రమేణా ఆక్రమణలకు గురై పార్కు అధ్వాన స్థితికి చేరుకుందన్నారు. దీంతో కనీసం కూర్చోడానికి కూడా స్థలం లేక పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఎంతో చరిత్ర కలిగిన పార్కును అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



పార్కు అభివృద్ధిపై కమిషనర్‌తో మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

ప్రమాదకరంగా వంతెన



రక్షణ గోడ కూలిపోయి ప్రమాదకరంగా మారిన వంతెన

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లి– మూలపేట రోడ్డులో ఉప్పుటేరుపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరుపైపులా ఉన్న రక్షణ గోడలు పూర్తిగా కూలిపోయాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల తాగునీటి ప్రధాన పైపులైన్ కోసం వంతెనను ఆనుకుని తవ్విన గొయ్యిని పూడ్చకుండా వదిలేశారు. దీంతో ప్రయాణికులు ఆ గోతిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెన రక్షణ గోడలు నిర్మించడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వంతెన వద్ద పైపులైను కోసం తవ్వి వదిలేసిన గొయ్యి

సత్యదేవుని దర్శించిన జిల్లా ఎస్పీ దంపతులు

అన్నవరం: కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ అధికారులు అందజేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ వెంట పలువురు పోలీస్ అధికారులు ఉన్నారు.

ఎస్పీ సతీష్ కుమార్ దంపతులకు సత్యదేవుని ఫొటో అందజేస్తున్న అధికారులు



ధాన్యం సొమ్ము కోసం ఎదురుతెన్నులు

- వెంటనే చెల్లించాలని రైతుల డిమాండ్



వేట్లపాలెంలో వ్యవసాయశాఖ జేడీ విజయకుమార్ సమక్షంలో ధాన్యం తరలించిన రైతులు (పాత చిత్రం)

సామర్లకోట: రబీ ధాన్యం విక్రయించిన సొమ్ముల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల ముగిసిన రబీలో అనేక మంది రైతులు తాము పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా మిల్లులకు విక్రయించారు. రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకూ ధాన్యం సొమ్ములు తమ బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని రైతులు వాపోతున్నారు. రైతులు ఒక పంట ద్వారా వచ్చిన ఆదాయాన్ని మరో పంటకు పెట్టుబడిగా పెడతారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పనులు ప్రారంభం అయ్యాయి. ఇలాంటి తరుణంలో చేతిలో సొమ్ములు లేక రైతులు తొలకరి సాగు పెట్టుబడికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీకి ముందు విక్రయించిన రైతుల బాపతు ధాన్యం సొమ్ము నాలుగు రోజుల్లోనే వారి బ్యాంకు ఖాతాలకు జమ అయ్యింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యాక, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు రైతుల బ్యాంకు ఖాతాలో జమ కావలసిన మొత్తాలను నిలుపుదల చేశారు. ఒక్క పీబీ దేవం గ్రామంలోనే వెయ్యి క్వింటాళ్ల ధాన్యం బాపతు సొమ్ము రైతుల ఖాతాలకు జమ కావలసి ఉంది. తమకు రావలసిన ధాన్యం సొమ్మును వెంటనే చెల్లించాలని వీకే రాయపురం, జి.మేడపాడు, పీబీ దేవం గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు. సామర్లకోట మండలంలో 200 మంది రైతులకు చెందిన సుమారు 12 వేల క్వింటాళ్ల ధాన్యం సొమ్ము వారి ఖాతాలకు జమ కావాల్సి ఉందని సొసైటీ మాజీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు తెలిపారు. తమ ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం సొమ్మును వెంటనే జమ చేసేలా అధికారులు చూడాలని రైతులు కోరుతున్నారు. పెట్టుబడి సొమ్ము లేకపోవడంతో అనేక మంది రైతులు ప్రస్తుత ఖరీఫ్ దమ్ములు కూడా ప్రారంభించలేదని వరహాలబాబు తెలిపారు. దీనిపై మండల వ్యవసాయాధికారి ఐ. సత్యను ‘సాక్షి’ వివరణ కోరింది. ధాన్యం సొమ్ము బకాయిల విషయాన్ని పౌరసరఫరాల శాఖ అధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకువెళ్లినట్టు బదులిచ్చారు.

‘అంగన్ వాడీ పిలుస్తోంది’ విజయవంతం చేయాలి

- సీడీపీఓ ఉష
- బలుసులపేట సెక్టార్‌లో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే



సామర్లకోట బలుసులపేట అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలో గ్రాడ్యుయేషన్ డే

సామర్లకోట: రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన ‘అంగన్‌వాడీ పిలుస్తోంది’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీడీపీఓ ఉష కోరారు. స్థానిక బలుసులపేట అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలో బుధవారం సెక్టార్ సూపర్ వైజరు ఆర్.మంగ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ పాల్గొన్నారు. ఈ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల వయసు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్య నేర్పడం వల్ల విద్యార్థులకు పాఠశాలలకు వెళ్లాలనే ఉత్సాహం కలుగుతుందన్నారు. మూడేళ్లు నిండిన పిల్లలను సమీప అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పాలని ఆమె సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారం పాలు, గుడ్లు ఇస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని సీడీపీవో చెప్పారు. ఒకవేళ వారి వయసుకు తగిన బరువు లేకపోతే తీసుకోవలసిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు సూచనలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పి.సూర్యప్రభ, పి. సత్యసర్వాణి, కె.రాణి ఆర్.నాగమణి, సోమా సుప్రీతి తదితరులు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

- డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహ నాయక్

తొండంగి: మండలంలోని బెండపూడిలో డయేరియా ప్రబలిన నేపథ్యంలో రక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహనాయక్ తెలిపారు. రావికంపాడు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులను బుధవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహ నాయక్ పరామర్శించారు. అనంతరం బెండపూడి ఎస్సీపేట, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. డయేరియా ప్రభావిత ప్రాంతాలకు ప్రస్తుతం సరఫరా అవుతున్న తాగునీటిని నిలుపుదల చేసి ప్రత్యేకంగా ట్యాంకుల ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మంగళవారం నమోదైన 18 కేసుల్లో 10 కేసులు డయేరియా బాధితులుగా గుర్తించామన్నారు. కాగా బుధవారం కూడా మరో మూడు డయేరియా కేసులు నమోదైనట్టు తెలిపారు. అనారోగ్యానికి గురైన వారిని తుని ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నామన్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా గ్రామాల్లో నిల్వ మాంసాహార విక్రయాలు, కలుషిత ఆహార పదార్థాలు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో వైద్యారోగ్యశాఖ సిబ్బంది పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సరిత, రావికంపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అర్చన, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.



బెండపూడిలో పర్యటించి అధికారులకు సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ నరసింహనాయక్

బాధితులను పరామర్శించిన వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు

తొండంగి: మండలంలోని బెండపూడిలో డయేరియా బాధితులను వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు బుధవారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సూచనల మేరకు బెండపూడిలోని డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. డయేరియా బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ నాయకులు మద్దుకూరి వీర వెంకట సత్యనారాయణ(పెద్దబ్బు), గాబు రాజు, ఆరుమిల్లి ఏసుబాబు, దడాల విజయబాబు, మురాలశెట్టి సత్తిబాబు, పేకేటి హరికృష్ణ, కటకం ఈశ్వరరావు, బూసాల గణపతి తదితరులు ఉన్నారు.



బాధితులకు పరామర్శించిన వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు